సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం, 25, మార్చి, 2025



పరీక్షల వేళ .. పట్టుజారితే ప్రమాదం!
పరీక్షలు రాసిన అనంతరం పలువురు విద్యార్థులు తమ ద్విచక్రవాహనాల్లో ముగ్గురిని కూర్చోబెట్టుకొని సర్కస్‌ఫీట్లు చేస్తున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.57
రాజంపేట	6.29	5.03
పీలేరు	6.30	4.54
మదనపల్లె	6.32	4.56

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 130 మెట్రిక్ టన్నులు



కదిలిస్తే కన్నీరే!



లింగాల మండలం కోమన్నూతలలో మాజీ సీఎం వైఎస్ జగన్‌తో ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళారైతు

- ఈదురు గాలులకు నిలువునా నేలవాలిన తోటలు
- ప్రకృతి దెబ్బతీసినా..పట్టించుకోని ప్రభుత్వం
- లింగాల మండలంలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన వైఎస్ జగన్

సాక్షి కడప : పచ్చని ఫలం చూస్తుండగానే నేలవాలింది.. కొండంత కష్టం నేలపాలైంది. ప్రకృతి దెబ్బకు గెలలతో కళకళలాడుతున్న అరటి అల నిలువునా ఒరిగిపోయింది. రెండు,మూడు రోజుల్లో కోత కోద్దామనుకున్న రైతుల ఆశల్ని గాలివాన తుంచేసింది. వారి కాయాకష్టాన్ని నేలపాలు చేస్తూ వారి జీవితాల్లో కోత విధించింది. రెండు రోజుల క్రితం వీచిన గాలివానకు పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. నిండు కాపుతో ఉన్న చెట్లన్ని నేలపాలు కావడంతో రైతుల వేదన అరణ్య రోదనగా మారింది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడం మరింత



వడగండ్ల వానకు దెబ్బతిన్న అరటి కాయలను పరిశీలిస్తున్న వైఎస్ జగన్

బాధ కలిగిస్తోందని రైతులు వాపోయారు.

ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై వైఎస్ జగన్ ధ్వజం

గాలులు, వర్షాలకు లింగాల మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతలతోపాటు అనేక గ్రామాల రైతులు విలవిలలాడుతున్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటించారు. దెబ్బతిన్న తోటలను పరిశీలించారు. వారి బాధలను ఆలకించారు. అండగా ఉంటామని ధైర్యం నింపారు. ప్రభుత్వం మెడలు వంచైనా పరిహారం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని రైతులలో భరోసా నింపారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాద వుతోంది.. మరో మూడేళ్లలో తమ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే ఇన్సూరెన్స్‌తోపాటు పూర్తిస్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ..గతంలో ఇచ్చిన రూ.50వేల తరహా లోనే నెల రోజుల్లోనే అందిస్తామని రైతన్నల్లో భరోసా నింపారు.

అడుగడుగునా కన్నీటిగాథలే..

మాజీ సీఎం వైఎస్ జగన్ లింగాల మీదుగా తాతిరెడ్డిపల్లెకు వెళుతుండగా రైతులు అడుగడుగునా ఆపి తమ పొలాలను చూపించారు. సూర్యనారాయణ రెడ్డి తోట వద్దకు రాగానే ఇంద్రావతి, రాగమణి, లక్ష్మీదేవి, ఎం.లక్ష్మీదేవి, రాజేశ్వరి, వాలమ్మ తదితరులు జగన్‌ను చూడగానే కన్నీళ్లు పెట్టుకుంటూ... 'పంటంతా పోయింది.. రేపో మన్నాడో కోస్తామనుకునేలోపే పోయింది. ఉన్నఫలంగా గాలులు దెబ్బతీశాయి. మాకు దిక్కెవరంటూ' విలపించారు. కొందరు మహిళలు 'మాకు ఇద్దరు ఆడబిడ్డలు అని ఒకరు, మాకు ముగ్గురు ఆడబిడ్డలు ఉన్నారు ఎలా చదివించాలి, ఎలా బతికి బట్టకట్టాలంటూ బోరుమన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తీరా కోసే సమయంలో ఇలా పడిపోయిందని.. చివరకు కూలీలు దొరకడం లేదు.. ఆలస్యం కావడంతో దళారులు రేట్లు తగ్గిస్తున్నారు.. ఈ వ్యవస్థను మార్చండి.. మమ్ములను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండని' జగన్ వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. వారితోపాటు ఉన్న కొంతమంది తాతిరెడ్డిపల్లె రైతులు కూడా తమ బాధను మాజీ సీఎంకు వివరించారు. దళారుల రాజ్యం అధికంగా ఉందని.. ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని.. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వకపోతే పెట్టుబడులు కూడా దక్కవని వాపోయారు. దీనికి స్పందించిన వైఎస్ జగన్.. ప్రభుత్వం ఇన్సూరెన్స్‌కు ప్రీమియం చెల్లించలేదు.. కనీసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి మీకు న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు. అంతేకాకుండా అక్కడే ఉన్న ఉద్యాన శాఖ అధికారులతోపాటు రెవెన్యూ, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులను కూడా మాజీ సీఎం గట్టిగా ప్రశ్నించారు. చిన్నకుడాల క్రాస్ నుంచి లింగాల, తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల వరకు పొలాలను పరిశీలిస్తున్న సందర్భంలో ప్రతి రైతు కంట కన్నీరు కనిపించింది.

తోటలను పరిశీలించిన మాజీ సీఎం

అకాల వర్షాలకుతోడు పెనుగాలులతో లింగాల మండలంలో దెబ్బతిన్న అరటి తోటలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల గ్రామాల్లో సూర్య నారాయణ రెడ్డి, కేశవయ్య పొలాలతోపాటు దారి పొడవునా అరటి తోటలను పరిశీలించారు. తోటల పరిస్థితిని చూసి మాజీ సీఎం చలించిపోయారు.

కూటమి సర్కారుపై కన్నెర్ర

లింగాల మండల పర్యటనలో రైతులు పడుతున్న బాధలను దగ్గరగా చూసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత కూటమి సర్కార్ నిరంకుశ వైఖరిని తప్పుబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉన్న ఉచిత పంటల భీమా విధానాన్ని రద్దు చేసి కొత్తగా బీమా ప్రీమియం చెల్లించకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ సీఎం దుయ్యబట్టారు. రైతులకు సంబంధించి సున్నా వడ్డీ లేదు, కనీసం రైతు భరోసా లాంటిది అందించడంలేదని ధ్వజమెత్తారు. కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మండిపడ్డారు. మండు వేసవిలో ఎండలు అదరగొడుతున్నా.. మిట్ట మధ్యాహ్న సమయంలోనే రైతులతో మమేకమయ్యారు. రైతుల బాధలను పంచుకుంటూ.. పొలాల మధ్యనే రైతులతో మాట్లాడుతూ కదిలారు.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటన విజయవంతమైంది. సోమవారం మధ్యాహ్నం ఇడుపులపాయ నుంచి తాడేపల్లికి బయలుదేరే సమయంలో హెలీప్యాడ్ వద్ద వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చిన్నారిని ముద్దాడుతూ..



వృద్ధురాలిని పలకరిస్తూ..



విద్యార్థుల సమస్యలు ఆలకిస్తూ..

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వేంపల్లె : వేంపల్లె జెడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి కుమారుడికి వివాహమైన నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెడ్పీటీసీ స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇటీవల శ్రీలంకలో జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి కుమారుడైన సాయి భైరవ ప్రీతం కుమార్ రెడ్డి, వైష్ణవిల వివాహం జరిగింది. జిల్లా పర్యటనలో పులివెందులకు విచ్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లింగాల మండలంలో పర్యటించి అక్కడి అరటి రైతులను పరామర్శించిన అనంతరం రోడ్డు మార్గాన పులివెందుల నుంచి వేంపల్లెకు విచ్చేశారు. అలాగే రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పలకరించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మేయర్ సురేష్ బాబు, వేంపల్లె వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్ర ఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్‌బాషా, రవిశంకర్ గౌడ్, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మహిళలకు ఖురాన్ పఠనం



ఖురాన్ పఠనం, ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం మైనార్టీ మహిళలు

రాయచోటి జగదాంబసెంటర్ : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాయచోటి పట్టణం ఎస్ఎన్ కాలనీలో ఉన్న వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో సోమవారం ముస్లిం మైనార్టీ మహిళలకు ఖురాన్ పఠనం, ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీ ఎన్నికల్లో పోటీ చేయం

– టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

కడప రూరల్ : వైఎస్సార్ కడప జెడ్పీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమకు సంఖ్యా బలం లేదన్నారు. అందువలన తాము జెడ్పీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా జెడ్పీ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని స్పష్టం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, మాధవి రెడ్డి పాల్గొన్నారు.

నిత్యకల్యాణానికి విరాళాలు

బ్రహ్మంగారిమఠం : శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబల నిత్య కళ్యాణానికి భక్తులు విరాళాలు ఇస్తున్నారు. సోమవారం రాజుపాళెం మండలం అరకటవేముల గ్రామానికి చెందిన రాచంరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ధర్మపత్ని వెంకటసుబ్బమ్మ కుటుంబ సభ్యులతో స్వామి మాస కళ్యాణంకు కార్తిక శుద్ధ ద్వాదశ రోజున జరిపే ఈ కళ్యాణంకు రూ.1,00,150లు నగదు అందజేశారు. ఇదే క్రమంలో దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన మాబుషరీఫ్ ధర్మపత్ని రేష్మి రూ.1,00,116లు అందించారు. వీరికి స్థానిక పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ,మఠం మేనేజర్ ఈశ్వరాచారిలు ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా పిట్ పర్సన్ మాట్లాడుతూ.. నూతనంగా తలపెట్టిన వీరబ్రహ్మేంద్ర, గోవిందమాంబల మాస కార్తిక శుద్ధ ద్వాదశ రోజున జరిపే కళ్యాణానికి భక్తులకు వారికి తోచిన విధంగా విరాళాలు ఇస్తుండటం హర్షనీయమన్నారు.

సమస్టిగా క్షయవ్యాధిని నివారిద్దాం

జేసీ ఆదర్శరాజేంద్రన్



జెండాఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జెసి ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి అర్బన్ : క్షయవ్యాధి నివారణకు అందరూ సమస్టిగా కృషి చేద్దామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు ,సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రారంభించిన ర్యాలీని ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని 61 పంచాయతీలను టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాల సర్పంచ్‌లు,సీహెచ్ఓలకు టీబీ ముక్త్ పంచాయతీ అవార్డులను అందచేయనున్నట్లు తెలిపారు. 2027 నాటికి టీబీని పూర్తిస్థాయిలో నివారించే కార్యక్రమంలో అందరూ పాల్పంచుకోవాలని కోరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సామాజిక ప్రాంతీయ, జిల్లా అసుపత్రులలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం గల్ల, ఎక్స్‌రే పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే 6నెలల వరకు ఉచితంగా డాట్స్‌ద్వారా మందులను కూడా అందచేస్తారని చెప్పారు. ఏడీఎంహెచ్ఓ, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారిణి శైలజ మాట్లాడుతూ జిల్లాలో 9 టీబీ యూనిట్లు ఉన్నాయన్నారు. ఆయా యూనిట్లలోని వైద్యఅధికారులు, సిబ్బంది తమ పరిధిలో టీబీ కేసులను గుర్తించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం, డాట్స్ ద్వారా ఉచితంగా మందులు అందచేయడం , రోగులకు ప్రధా నమంత్రి పోషణ్ అభియాన్ పథకం కింద వారి ఖాతాలో నెలకు రూ.1000లు జమచేయడం జరుగుతోందని వివరించారు. అనంతరం టీబీ వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభను కనపరచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్, డీపీఎంఓ రియాజ్‌బేగ్, వైద్యులు కోటేశ్వరి, ఆశ్విన్, రియాజ్, రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టీబీ ప్రోగ్రాం పర్యవేక్షకులు శ్రీనివాసులు, మురళి, ప్రణీత్,భూపతి, తరుణ్,సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాములోరి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 14వ తేది వరకు శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 9న హనుమంత వాహనం, 10న గరుడవాహనం, 11న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణ జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అలాగే ఏప్రిల్ 12న రథోత్సవం, 14న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. కార్యక్రమంలో ఈఓ జె శ్యామలరావు, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

రాయచోటి : ప్రజా సమస్యల పరిరరాంలో ఏమాత్రం అలసత్వం చేయరాదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయడు పోలీసులు అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని ఎస్పీ తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

వేసవి నేపథ్యంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి అర్బన్/జగదాంబసెంటర్: వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి అధికారి డీవీ రంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండుతున్న ఎండలను గుర్తెరిగి కార్మికుల రక్షణ కోసం యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా కార్మికుల పనిగంటలలో మార్పులు,చేర్పులు చేసుకోవాలన్నారు. బహిరంగంగా పనిచేసే కార్మికులు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనివేళలు మార్చుకోవాలన్నారు. పనిప్రాంతంలో చల్లనినీరుతో పాటు నీడవసతిని కూడా కల్పించాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురికాకుండా డీహైడ్రేషన్ నివారణ మార్గాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

అర్జీలకు సత్వరమే పరిష్కారం

– జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని నూరుశాతం పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్త శుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

కేజీబీవీల్లో ప్రవేశాలకు పిలుపు

ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలో కేజీబీవీలు	: 22
ప్రవేశాలు	: 6వ తరగతి

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం : ఎంపీసీ,బైపీసీ, ఎంఈసీ,సీఈసీ, ఎంఎల్‌టి, ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులు 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్లు



తంబళ్లపల్లెలోని కేజీబీవీ విద్యాలయం



స్టడీ అవర్స్‌లో చదువుతున్న కేజీబీవీ విద్యార్థినులు


మదనపల్లె సిటీ : గ్రామీణ ప్రాంత నిరుపేద కుటుంబాలు, అనాథ బాలికల చదువుకు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) బాసటగా నిలుస్తున్నాయి. ఉచిత వసతితోపాటు భోజనం ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. తాజాగా కేజీబీవీల్లో 6వ తరగతితోపాటు ఇంటర్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు విధించారు. అర్హులైన బాలికలు 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చు.

జిల్లా వ్యాప్తంగా చిన్నమండ్యం, చిట్వేలి, గాలివీడు, కలకడ, కురబలకోట, కె.వి.పల్లి, లక్కిరెడ్డిపల్లె, ములకలచెరువు, నిమ్మనపల్లె, ఓబులవారిపల్లె, పెద్దమండ్యం, పెనగలూరు, పెద్దతిప్పసముద్రం, పుల్లంపేట, రామాపురం, రామసముద్రం, రాయచోటి, సంబేపల్లి, తంబళ్లపల్లె, టి.సుండుపల్లి, వీరబల్లి, బి.కొత్తకోటల్లో కేజీబీవీలు ఉన్నాయి. సీట్ల భర్తీలో నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీ వారీగా ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం సీట్లను భర్తీ చేస్తారు. 7,8,9 ,10, 12 తరగతుల్లో మిగిలిన సీట్లకుఆడ్మిషన్లు ఉంటాయి. దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ సైట్ ద్వారా పొందవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. ఇందు కోసం రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించారు.

తరగతికి 40 మంది...

కేబీజీబీలో 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతికి 40 సీట్ల చొప్పున కేటాయించారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఒక్కో కేజీబీవీలో ఒక్కో గ్రూపును ప్రవేశపెట్టారు. 40 సీట్ల చొప్పున అడ్మిషన్లు ఉంటాయి.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. విద్యార్థినులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పేద, అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఇక్కడ బోధనతో పాటు వసతి ఉంది.

– సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



కేజీబీవీ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది. మౌలికసదుపాయాలు, విద్యార్థులకు స్మార్ట్ డిజిటల్ తరగతులు ద్వారా బోధన ఉంటుంది. బాలికలకు భరోసాగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. చదువుతో పాటు క్రీడలు, ఇతర నైపుణ్యాలను మెరుగులు దిద్దుతాం.

– సుమతి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్.కేజీబీవీ, తంబళ్లపల్లె

క్లుప్తంగా

రాళ్ల దాడిలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : ఓ యువకుడు మరో ముగ్గురిపై రాళ్లతో దాడి చేయడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. చిప్పిలికి చెందిన లడ్డూ (32) టౌన్‌లోకి వెళ్లి రావాల్సి ఉందని మండలంలోని జంగాలపల్లెకు చెందిన ఆదికేశవ (40)ను ద్విచక్రవాహనం ఇవ్వాల్సిందిగా కోరాడు. దీంతో అతను వాహనంలో పెట్రోల్ లేదని, ఇవ్వలేనని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న లడ్డూ..తాను అడిగితే బండి ఇవ్వవా అంటూ ఆదికేశవతో పాటుగా వేంపల్లెకు చెందిన చరణ్ (30), అంకిశెట్టిపల్లెకు చెందిన సుమంత్ (31)లతో గొడవపడ్డాడు. ఘర్షణలో ముగ్గురిపై రాళ్లతో దాడిచేశాడు. దాడిలో ఆదికేశవ తీవ్రంగా గాయపడగా, చరణ్, సుమంత్‌లు సైతం గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

13 మందిపై రౌడీషీట్ కేసులు

రాయచోటి టౌన్ : పిల్లలపై నేరాలకు పాల్పడిన 13 మందిపై రౌడీ షీట్ కేసులు నమోదు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటిలో గత రెండేళ్ల కాలంలో మైనర్లపై దాడులకు పాల్పడిన వారిపై నిఘా ఉంచామన్నారు. అలాంటి వారిలో 13 మందిని గుర్తించి రౌడీషీట్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చిన్న పిల్లలు, మహిళలపై దాడులకు పాల్పడినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అరటి తోటలను పరిశీలించిన మంత్రి సవిత


పార్నపల్లెలో నేలకూలిన అరటి తోటను పరిశీలిస్తున్న మంత్రి సవిత, తదితరులు

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో శనివారం రాత్రి భారీ ఈదురు గాలులు, వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్న అరటి తోటలను సోమవారం రాష్ట్ర మంత్రి సవిత పరిశీలించారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లె గ్రామంలో పర్యటించి అక్కడ తీవ్రంగా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి రైతులతో చర్చించారు. అనంతరం పార్నపల్లె గ్రామంలో దెబ్బతిన్న అరటి పంటలను, తమలపాకు తోటలను పరిశీలించారు. తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆమె రైతులకు హామీ ఇచ్చారు.

ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో పోటాపోటీగా క్రికెట్ పోటీలు


విన్నర్ జట్టుకు బహుమతులను అందిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పోటాపోటీగా క్రికెట్ పోటీలు జరిగాయి. సోమవారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోని ఆట స్థలంలో స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు నిర్వహించారు. దీంతో టీచింగ్, నాన్ టీచింగ్ మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో టెక్నికల్ టైగర్స్ జట్టు విజయం సాధించింది. మొదట టాస్ గెలిచిన ఆర్‌కేవీ రైడర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్లలో 78 పరుగులు చేయగా.. బ్యాటింగ్‌కు దిగిన టెక్నికల్ టైగర్స్ జట్టు ఒక ఓవర్ మిగిలి ఉండగానే 79 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలను డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అభినందించారు.

పరీక్షల వేళ .. పట్టుజారితే ప్రమాదం!

- ద్విచక్ర వాహనాల్లో పరీక్షా కేంద్రాలకు మైనర్ విద్యార్థులు
- ఒకే వాహనంలో ముగ్గురి నుంచి నలుగురు ప్రయాణం
- పరీక్షా కేంద్రం వద్దే ద్విచక్రవాహనాలతో సర్కస్ ఫీట్లు



పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థినులను వెంబడిస్తూ వేగంగా వారి ముందువైపు నుంచి ద్విచక్రవాహనాల్లో వెళుతున్న విద్యార్థులు

గుర్రంకొండ : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఇష్టానుసారం ద్విచక్రవాహనాల్లో పరీక్షా కేంద్రాల వద్దకు వస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ముగ్గురు నుంచి నలుగురు విద్యార్థులు ఒకే ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు పరీక్షలు రాసిన తరువాత పరీక్షా కేంద్రాల వద్దనే రోడ్డుపై సర్కస్ ఫీట్లు చేస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పరీక్షలు రాసే ఇలాంటి సమయాల్లో పట్టుజారి ప్రమాదాలకు గురైతే వారి పరిస్థితి ఏంటని ఈ దృశ్యాలను చూసిన వారు చర్చించుకుంటున్నారు.

జాతీయ రహదారిపై అజాగ్రత్తగా..

అన్నమయ్య జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల వద్ద ఎక్కువగా ద్విచక్రవాహనాల్లో వచ్చే విద్యార్థుల సంఖ్య కనిపిస్తోంది. గుర్రంకొండలోని తెలుగు, ఉర్దూ జెడ్పీ హైస్కూళ్లలో 324 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. పలువురు విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై పరీక్షా కేంద్రాలకు వస్తున్నారు. అదికూడా ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు నుంచి నలుగురు కలిసి ప్రయాణిస్తుండడం గమనార్హం. ఎన్‌హెచ్ 340 కడప–బెంగళూరు జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తున్న ఈ రెండు జెడ్పీ హైస్కూళ్లు జాతీయ రహదారికి పక్కనే ఉన్నాయి. దీంతో వేగంగా పరీక్షా కేంద్రాలకు ద్విచక్రవాహనాలపై వచ్చే విద్యార్థులు పట్టుజారి ప్రమాదాల బారిన పడితే వారి భవిష్యత్తు ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. కనీసం ఇంటి దగ్గర తల్లిదండ్రులు కూడా విచక్షణ లేకుండా పదో తరగతి పరీక్షలు రాసే తమ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇచ్చి పంపిస్తుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి దృశ్యాలను పోలీసులు గమనిస్తూ కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. పోలీసులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.

విన్యాసాలతో వికృత చేష్టలు..

పరీక్షలు రాసిన అనంతరం పలువురు విద్యార్థులు తమ ద్విచక్రవాహనాల్లో ఏకంగా ముగ్గురిని కూర్చోబెట్టుకొని సర్కస్‌ఫీట్లు చేస్తున్నారు. కొంతమంది విద్యార్థినులను వెంబడిస్తూ వేగంగా వారి ముందువైపు వాహనాలను నడుపుతూ ప్రమాదకర ఫీట్లు చేస్తుండడం దారుణం. ద్విచక్రవాహనాల్లో వచ్చే విద్యార్థులు పరీక్షా సమయం ముగిసినా ఇళ్లకు వెళ్లకుండా రోడ్లపై ఇష్టానుసారం వేగంగా వాహనాలు నడుపుతూ పరీక్షా కేంద్రాల వద్దనే చక్కర్లు కొడుతూ భయంకర విన్యాసాలకు పాల్పడుతున్నారు.



గుర్రంకొండలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు ముగ్గురు విద్యార్థులు కలసి ఒకే ద్విచక్ర వాహనంలో వెళుతున్న దృశ్యం


ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాల్లో నిర్లక్ష్యంగా వెళుతున్న విద్యార్థులు

తల్లిదండ్రులు ఆలోచించాలి

అభం శుభం తెలియని పదో తరగతి విద్యార్థులకు పరీక్షల వేళ ద్విచక్రవాహనాలు ఇచ్చి పంపిస్తుండడం ఎంతవరకు సబబో వారి తల్లిదండ్రులు ఆలోచించాలి. పరీక్షల సమయంలో ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో బయలుదేరిన తమ పిల్లలు తిరిగి క్షేమంగా ఇంటికి వచ్చే వరకు ఎన్ని ప్రమాదాలు దాటుకొని వస్తారో అర్థం చేసుకోవాలి. ఇలాంటి సమయంలో జరగరానిది ఏదైనా జరిగితే విద్యార్థులకు జరిగే నష్టానికి వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.



– సురేంద్రబాబు, ఎంఈఓ, గుర్రంకొండ

నిఘా ఉంచుతాం

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఇక మీదట పోలీసుల నిఘా ఉంచుతాం. మైనర్ విద్యార్థులకు బైకులు ఇచ్చి పంపించడం తప్పు. పరీక్షల వేళ తొందర పాటుగా వేగంగా వచ్చి ప్రమాదాలకు గురైతే నష్టపోయేది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా. పరీక్షా కేంద్రాల వద్దకు ద్విచక్రవాహనాలపై వచ్చే విద్యార్థుల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.



– మధురామచంద్రుడు, ఎస్‌ఐ, గుర్రంకొండ

పట్టపగలే వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ


కమ్మ దోచుకున్నాడని చూపుతున్న వృద్ధురాలు


చోరీ చేసి ఇంట్లో నుంచి పారిపోతున్న ఆగంతకుడు

మదనపల్లె : పట్టపగలే ఆగంతకుడు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిని బెదిరించి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. దేవళంవీధికి చెందిన రాజమ్మ(80)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ఆమె ఒంటరిగా మరో ఇంట్లో ఉంటోంది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో సుమారు 25 సంవత్సరాలు వయస్సు కలిగిన యువకుడు తలకు టోపీ, ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించి వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డాడు. వృద్ధురాలిని గొంతునులిమి బెదిరించి మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు గొలుసుతో పాటు మరో 5 గ్రాముల చెవి కమ్మను బలవంతంగా లాక్కుని పరారయ్యాడు. బాధిత వృద్ధురాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని చోరీ ఘటనపై ఫిర్యాదు చేసింది. పోలీసులు, వృద్ధురాలి ఇంటి సమీపంలోని సీసీ టీవీ పుటేజీని పరిశీలించగా, మాస్క్ ధరించిన వ్యక్తి చోరీ చేసి పారిపోతుండటాన్ని గుర్తించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు.

ప్రకృతిని ప్రేమించండి.. భవిష్యత్తును కాపాడండి

శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్


విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : అడవులు మనకు జీవనాధారం, పచ్చదనాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత. ఈ విషయాలను ప్రాక్టికల్‌గా అర్థం చేసుకునేలా ఒంటిమిట్ట అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక ప్రత్యేకమైన ప్రకృతి అవగాహన శిబిరం నేచర్ క్యాంప్ సోమవారం ఏర్పాటు చేశారు. ఒంటిమిట్ట మండల కేంద్రంలోని శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమశిల వెనుక జలాలు కలిగిన కుడమలూరు గ్రామంలో మంటపంపల్లి గ్రామ శివారులోని వనమిత్రలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతిలో అనుభూతిని పొందేలా అటవీ సంపదను కళ్లారా చూసేలా ప్రత్యేకమైన ఈ క్యాంప్ విద్యార్థులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిందని ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగు నాయక్, ఎఫ్ఎస్ఓ బ్రహ్మయ్య, నర్సరీ ఎఫ్‌బీఓ బాషా, సరోజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య, ఉపాధ్యాయుడు రాజ, అటవీశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద ఆగిన అద్దె బస్సులు

- అవస్థలు పడిన ప్రయాణికులు
- ఎట్టకేలకు బస్సులకు ఫాస్ట్ ట్రాక్ వేయడంతో కదిలిన వైనం


టోల్‌గేట్ వద్ద నిలిచిన ఆర్టీసీ అద్దె బస్సులు

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారి బండపల్లె వద్ద గల టోల్‌ప్లాజాలో రాయచోటికి చెందిన ఏపీఎస్‌ఆర్టీసీ అద్దె బస్సులకు ఫాస్ట్‌ట్రాక్‌లో నిధులు లేకపోవడంతో అన్ని బస్సులను సోమవారం టోల్‌ప్లాజా సిబ్బంది ఆపేసి, పక్కన నిలబెట్టారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆయా బస్సులలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవరు, కండక్టర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. ఒక్కసారిగా అన్ని బస్సులకు ఫాస్ట్ ట్రాక్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. చివరకు బస్సు నిర్వాహకులు, యజమానులు, టోల్‌ప్లాజా వద్దకు చేరుకొని ఫాస్ట్ ట్రాక్ వేయడంతో ఒక్కో బస్సును టోల్‌ప్లాజా దాటించే ప్రయత్నం చేశారు.

పోక్సో కేసు నమోదు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలో ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. సీఐ కథనం మేరకు బాలిక గ్రామంలో 5వ తరగతి చదువుతోంది. హోంవర్క్ చేసుకునేందుకు పెన్సిల్ లేకపోవడంతో కొనేందుకు ఇంటి ఎదురుగా ఉన్న బంక్ వద్దకు వెళ్లింది. దీంతో ఆ వ్యక్తి ఇంటి లోపలికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెంటనే బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఆదివారం రాత్రి బాలిక తల్లిదండ్రులు పట్టణ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం కడప రోడ్డులోని మహేశ్వరనగర్ కాలనీలో ఓ చిల్లర దుకాణంలోకి గుర్తుతెలియని యువకుడు వచ్చి అంగట్లో ఉన్న లక్ష్మీదేవి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును చోరీ చేసేందుకు యత్నించాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప రోడ్డులో లక్ష్మీదేవి అనే మహిళ చిన్న అంగడి పెట్టుకుని ఉంది. సోమవారం ఓ గుర్తు తెలియని యువకుడు అంగడికి వచ్చి వాటర్ ప్యాకెట్ అడిగాడు. ఆ ప్యాకెట్‌ను ఇచ్చేందుకు లక్ష్మీదేవి పక్కకు తిరిగిన వెంటనే ఆ యువకుడు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేశాడు. దొంగను పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు.

మారాఠా మహాసంఘ్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా నియామకం


సాగర్

బద్వేలు అర్బన్ : స్వాభిమాన్ మారాఠా మహాసంఘ్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా బద్వేలుకు చెందిన ఎం.కె.బి.ఎస్.ఆర్.సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కృషీరాజ్‌టకలేపాటిల్ ద్వారా సోమవారం నియామకపత్రం అందుకున్నారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర మరాఠా సంఘం గౌరవ అధ్యక్షుడిగా, రాష్ట్రీయ మరాఠా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ద్వారా బాధ్యత మరింత పెరిగిందని, రాబోవు రోజుల్లో సంఘం అభివృద్ధికి, సమాజ సేవకు కృషి చేస్తానని తెలిపారు.

కేబుల్ వైర్లు చోరీ

తొండూరు : మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేసినట్లు రైతులు వాపోయారు. మండలంలోని టి.తుమ్మలపల్లె, కాంబల్లె, బొజ్జాయిపల్లె, తేలూరు గ్రామాలకు చెందిన దాదాపు 20 మంది అరటి, చీనీ తోటలకు సంబంధించిన రైతులు బోరు బావుల్లో ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. ఈ విషయమై తొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కడుపునొప్పి మాయం చేస్తానంటూ బంగారం చోరీ

జమ్మలమడుగు రూరల్ : పదే పదే వస్తున్న కడుపునొప్పిని మాయం చేస్తానని నమ్మబలికి 10 తులాల బంగారాన్ని ఓ మహిళ చోరీ చేసి పరారైన సంఘటన సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని దళితవాడలో జరిగింది. సీఐ ఎస్. లింగప్ప కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దళితవాడకు చెందిన చంద్ర లావణ్యకు తరచూ కడుపునొప్పి వస్తున్న నేపథ్యంలో ఓ మహిళ పరిచయమైంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి పూజ చేస్తే కడుపునొప్పి పోతుందని చెప్పడంతో ఇంటిలో పూజలు ప్రారంభించారు. కాగా ఇంటిలో ఉన్న బంగారాన్ని డబ్బాలో వేయాలని పూజ అనంతరం సాయంత్రం డబ్బా తెరవాలని మహిళ చెప్పింది. సాయంత్రం బంగారు వేసిన డబ్బా తెరిచి చూడగా బంగారం లేదు. వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధితులు ఫిర్యాదు చేశారు.

రాజంపేట కోర్టు క్లాంపెక్స్ ఒప్పందం అమలుకు కృషి


మాట్లాడుతున్న రాజంపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు హనుమంతునాయుడు

రాజంపేట : రాజంపేట కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన స్థలం అంశంలో రెవెన్యూ, న్యాయశాఖ మధ్య జరిగిన ఒప్పందం అమలుకు తన వంతుగా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చా హనుమంతు నాయుడు అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోర్టు క్లాంపెక్స్ ఒప్పందంలో భాగంగా తహసీల్దారు కార్యాలయాన్ని అధికారికంగా న్యాయశాఖకు అప్పగించారని గుర్తు చేశారు. రాజంపేట కోర్టుకు మహర్దశ కల్పించేందుకు అసోసియేషన్ కార్యవర్గ సహకారంతో కృషి చేస్తానన్నారు. కోర్టు నూతన భవనాల నిర్మాణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో తాము ముందుంటామన్నారు. సమావేశంలో న్యాయవాది కేఎంఎల్ నరసింహులు, రాజంపేట, నందలూరు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా గోవిందమాంబ ఆరాధన ఉత్సవాలు


మాతా గోవిందమాంబ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారె, చీరెను అందిస్తున్న సంఘం సభ్యులు

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవం సోమవారం బ్రహ్మంగారిమఠంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో దాదాపు 200 మంది మహిళలు అమ్మవారికి చీరె, సారెను అందించారు. ప్రత్యేక భజనలు, అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి వీరబ్రహ్మేంద్ర, గోవిందమాంబ సమేత ఉత్సవ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రస్వామి, దత్తస్వామి, మఠాధిపతి తమ్ముడు వీరభద్రస్వామి, దేవస్థాన సిబ్బంది, పురప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పండుగ సరుకులకు వెళుతూ..

- ఓమ్నీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడి దుర్మరణం
- మృతుడి భార్యకు తీవ్ర గాయాలు


వెంకట రాజారెడ్డి (ఫైల్)


మృతి చెందిన వెంకట రాజారెడ్డి

ఎర్రగుంట్ల : ఉగాది పండుగ సరుకుల కోసం భార్యాభర్తలు స్కూటీలో వెళుతుండగా ఓమ్నీ వ్యాన్ వచ్చి ఢీకొన్న సంఘటనలో బచ్చు వెంకట రాజారెడ్డి (45) మృతి చెందగా, అతని భార్య సుజాత తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మాలెపాడు– కలమల్ల గ్రామాల మధ్య జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలమల్ల గ్రామానికి చెందిన బచ్చు వెంకటరాజారెడ్డి (45) ఆర్టీపీపీ స్టేజీ–4లోని యాష్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడుగా పని చేసేవాడు. ఇతనికి భార్య సుజాతతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజారెడ్డి సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. ఉగాది పండుగ దగ్గర ఉండటంతో పండుగ సరుకులు తీసుకువచ్చేందుకు వెంకటరాజారెడ్డి, సుజాత దంపతులు స్కూటీలో ఇంటి వద్ద నుంచి కలమల్ల–మాలెపాడు గ్రామాల మీదుగా ప్రొద్దుటూరుకు బయలు దేరారు. కలమల్ల– మాలెపాడు గ్రామాల మధ్య పిల్ల కాలువ వద్దకు రాగానే వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న ఓమ్నీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీలో వెళుతున్న రాజారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కలమల్ల పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్‌ఐ తిమోతి తెలిపారు.

బ్యాడ్మింటన్ చాంపియన్‌లుగా నాగరాజు– నితిన్ జోడీ

రన్నరప్‌గా నరసింహారెడ్డి – ప్రభాకర్ రెడ్డి


జిలానీ బాషాను సత్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తులు, సిబ్బంది

కడప అర్బన్ : న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలుగా నాగరాజు – నితిన్ జోడి నిలిచింది. కడప నగరం పక్కీరుపల్లెలోని పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు న్యాయమూర్తి రామారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని చక్కటి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని అభినందించారు. కాగా టోర్నీలో రన్నరప్‌గా నరసింహారెడ్డి – ప్రభాకర్ రెడ్డి జోడీ నిలిచింది.

అంతర్జాతీయ అంపైర్ జిలానీ బాషాకు సత్కారం

అంతర్జాతీయ అంపైర్‌గా బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లాకు చెందిన ఎస్. జిలానీబాషాను టోర్నమెంట్ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ అంపైర్‌గా రాణిస్తూ ఉండడంతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రెఫరీ సెలక్షన్ కమిటీ అసెసర్ గా ఎంపిక కావడంపై జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు, న్యాయశాఖ ఉద్యోగులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శశికాంత్ రెడ్డి, కోశాధికారి గుప్తా, కృష్ణప్రసాద్, అహ్మద్, బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు సోనీ శ్యామూల్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

వేపరాలకు చెందిన ఇద్దరి మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన నాగేంద్ర, శేషాచలం


రోడ్డు పక్కన పడిన బైకు

జమ్మలమడుగు : ద్విచక్రవాహనాల్లో అరుణాచలం బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన నలుగురు యువకులు ప్రముఖ శైవ క్షేత్రమైన తమిళనాడులోని తిరునామలై అరుణాచలానికి ద్విచక్ర వాహనాల్లో బయలుదేరారు. తమిళనాడులోని రాణికోట పట్టణ సమీపంలో వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో గంజికుంట శేషాచలం(29) బడిగించల నాగేంద్ర(31) కిందపడ్డారు. అదే సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన కారు వీరిద్దరిపై నుంచి వెళ్లడంతో శేషాచలం, నాగేంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గంజికుంట శేషాచలంకు వివాహమై ఒక కుమార్తె ఉంది. సోమవారం సాయంత్రం మృతదేహాలు స్వగ్రామమైన వేపరాలకు చేరాయి.